# ఉద్యమ పార్టీపై నిందలు మానుకోవాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్

- ఈటల జమున తన వ్యాఖ్యలను వాపస్ తీసుకోవాలి
- బీజేపీయే ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకున్న విషయం మరవద్దు
- ఎవరెన్ని కుట్రలు చేసినా కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయం
- బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్

హుజూరాబాద్‌టౌన్, నవంబర్14: తెలంగాణ ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న ఉద్యమ పార్టీ బీఆర్ఎస్‌పై నిందలు వేస్తూ విష ప్రచారం చేయడం బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సతీమణి జమునకు తగదని బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ సూచించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒకటేనని, హుజూరాబాద్‌లో కాంగ్రెస్‌కు ఓటేస్తే బీఆర్ఎస్‌కు వేసినట్లేనని ఆమె చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. మంగళవారం సిటీ సెంటర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈటల జమున తన వ్యాఖ్యలను వాపస్ తీసుకోవాలన్నారు. ఉద్యమ పార్టీ అయిన బీఆర్ఎస్‌కు జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌కు లింకు పెట్టి ఓటర్ల మనసు మార్చాలని చూడడం సరికాదన్నారు. కాంగ్రెస్ గెలిచినా బీఆర్ఎస్ గెలిచినా ఒకటేనని జమున తప్పుడు ప్రచారం చేయడం చాలా శోచనీయమన్నారు. బీఆర్ఎస్‌కు ఏ పార్టీతో పొత్తు గాని సంబంధం గాని లేదని స్పష్టం చేశారు. బీజేపీ ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకున్నదనే విషయాన్ని ఆమె మరచిపోయి మాట్లాడుతున్నారని గుర్తు చేశారు. ఉద్యమ పార్టీగా బీఆర్ఎస్ ఎల్లకాలం ప్రజల మదిలో నిలిచి ఉంటుందన్నారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో 100 సీట్లను కైవసం చేసుకుంటుందని, మూడోసారి కేసీఆర్ సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

### సభను విజయవంతం చేయాలి

ఈనెల 17న జమ్మికుంటలో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని, కార్మికులు, కర్షకులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని బండ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మధ్యాహ్నం 2 గంటలకల్లా ప్రజలు సభాస్థలికి చేరుకునేలా చూడాలని పార్టీ శ్రేణులకు సూచించారు. సభ ప్రాంగణంలో ప్రజలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. సమావేశంలో హుజూరాబాద్ సింగిల్ విండో అధ్యక్షుడు ఎడవెల్లి కొండల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కన్నెబోయిన శ్రీనివాస్ యాదవ్, రైతు బంధు సమితి మండలాధ్యక్షుడు దాసరి రమణారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వర్ధినేని రవీందర్‌రావు, కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు మాలుగురి ప్రభాకర్, లారీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఏ సలీం, బీఆర్ఎస్ నాయకులు జే రాజేందర్, కే కిరణ్ గౌడ్, పంకాల శ్రీధర్ గౌడ్, కొలిపాక సమ్మయ్య, రాజు, ఇజ్జగిరి కుమార్, తాళ్లపల్లి వెంకటేశ్, పోచంపల్లి సదయ్య తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘాలతోనే రైతుల ఆర్థికాభివృద్ధి

- పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్
- ఘనంగా సహకార సంఘం వారోత్సవాలు



సహకార జెండాను ఆవిష్కరిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ సంపత్

జమ్మికుంట, నవంబర్ 14: సహకార సంఘాల సహకారంతోనే అన్నదాతల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతున్నదని, వాటి బలోపేతానికి సర్కారు చేస్తున్న కృషికి రైతులంతా కృతజ్ఞతతో ఉంటారని జమ్మికుంట ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ పొనగంటి సంపత్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని సహకార సంఘం 70వ వార్షికోత్సవాన్ని సంఘం కార్యనిర్వాహణాధికారి ఒజ్జ రవీందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్, జెండా ఆవిష్కరణ చేశారు. కేక్ కట్ చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం సంఘ సభ్యులు, రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ పరిధిలోని మొత్కులగూడెం, ఆబాది, కేశవాపూర్, మండలంలోని మాచినపల్లి, జగ్గయ్యపల్లి, పెద్దంపల్లి, ఎడ్లపల్లి గ్రామాలు విలీనమై ఒక సొసైటీగా ఏర్పడ్డాయని, సొసైటీ నేటికి విజయవంతంగా నడుస్తున్నదని తెలిపారు. ఐకేపీ కేంద్రాలకు దీటుగా పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతులకు ప్రభుత్వ మద్దతు ధరలతో ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నామని, ఎప్పటికప్పుడు ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తున్న విషయాన్ని చెప్పారు. సంఘ సభ్యులకు క్రాప్, కమర్షియల్ రుణాలు అందిస్తున్నామని, సకాలంలో రైతులు రుణాలు చెల్లిస్తున్నారని తెలిపారు. సంఘం ద్వారా గోదాములు, పెట్రోల్ పంపు, సీడ్ ప్లాంటు, తదితర రైతులకు ఉపయోగపడే ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. సంఘం సభ్యులు, నిధి, రుణాలు, తదితర విషయాలు వెల్లడించారు. వైస్ చైర్మన్ మామిడి తిరుపతిరెడ్డి, సొసైటీ డైరెక్టర్లు, సిబ్బంది తిరుపతి, దేవేందర్, తిరుపతిరావు, రాజయ్య, లింగారావు, శ్రీలత, మల్లయ్య, సత్తిరెడ్డి, రైతులు, తదితరులున్నారు.

# కౌశిక్‌రెడ్డిని గెలిపించుకోవాలి

- 27వ వార్డులో బీఆర్ఎస్ శ్రేణుల ఇంటింటా ప్రచారం



కరపత్రాలు పంచుతూ ఓటు అడుగుతున్న బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, 27వ వార్డు అధ్యక్షుడు తాళ్ల పెల్లి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 14: అందరికీ అందుబాటులో ఉండే బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డికి ఓటేసి గెలిపించాలని పార్టీ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, 27వ వార్డు అధ్యక్షుడు తాళ్లపెల్లి శ్రీనివాస్‌గౌడ్ ఇంటింటా తిరిగి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. హుజూరాబాద్ పట్టణంలోని 27వ వార్డులో కౌన్సిలర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కౌశిక్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే నియోజకవర్గంలో స్థానికంగా ఉంటూ ప్రజా సేవ చేస్తున్న కౌశిక్‌రెడ్డిని పెద్ద మనస్సుతో ఆశీర్వదించాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు పరుస్తున్న అనేక సంక్షేమ పథకాలను అర్హులకు చేర్చడంలో ఆయన నిరంతరం పాటు పడుతున్నారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టణంలో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను చూసైనా ఓటర్లు కౌశిక్‌రెడ్డికి పట్టం కట్టాలన్నారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్నప్పటికీ కొందరు కౌశిక్‌రెడ్డిపై దుష్ప్రచారం చేస్తున్నారని, అందరికీ అందుబాటులో ఉండే నాయకుడిగా ఆయనను గుర్తించి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో హుజూరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొలిపాక సమ్మయ్య, పంజాల శ్రీధర్‌గౌడ్, కుడికాల అశోక్, గోగికార్ అనిల్, తాటిపాముల తిరుపతి, రాపర్తి అన్నయ్యలింగం తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని 34, 35, 36, 40, 43 ఎలక్షన్ బూత్‌లలో 100 ఓట్ల ఇన్‌చార్జిలను కౌన్సిలర్ శ్రీనివాస్ నియమించి దిశా నిర్దేశం చేశారు.



సీఎం సభాస్థలి వద్ద అధికారులకు సూచనలిస్తున్న సీపీ అభిషేక్ మహంతి

# 'సీఎం సభ' స్థలాన్ని పరిశీలించిన సీపీ

జమ్మికుంట, నవంబర్14: ఈ నెల 17న జమ్మికుంటలో సీఎం కేసీఆర్ సభ జరుగనున్న నేపథ్యంలో కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి మంగళవారం పట్టణానికి వచ్చారు. సీఎం సభా స్థలాన్ని, నాయిని చెరువు వద్దగల హెలీప్యాడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా హుజూరాబాద్ ఏసీపీ ఎల్ జీవన్‌రెడ్డి, పట్టణ సీఐ రమేశ్‌కు సలహాలు, సూచనలు అందించారు. సభకు ఎంత మంది వస్తారు..? బారికేడ్‌లు, లోనికి అనుమతి, వాహనాల పార్కింగ్, తదితర అంశాలపై చర్చించారు. హెలీప్యాడ్ నుంచి సీఎం కేసీఆర్ సభాస్థలం వద్దకు వెళ్లే రూట్‌మ్యాపు తయారు చేసుకోవాలని సూచించారు. ఒక ప్రణాళికా ప్రకారం ముందుకు సాగాలని చెప్పారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. సీఎం పర్యటన సందర్భంగా అధికారులు, సిబ్బంది విధులు పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఇక్కడ సీపీతో పాటు హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి, టౌన్ సీఐ రమేశ్, ఎస్ఐలు శ్రీధర్, రాజేశ్, తదితరులున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పోల్నేని సత్యనారాయణరావు

# 'తుమ్మేటి'కి మహిళలు బుద్ధి చెబుతారు

- 'పాడి' కూతురుపై వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి
- తన తండ్రి గెలుపు కోసం ఓటు అడగడం నేరమా..?
- జమ్మికుంట ఏఎంసీ మాజీ చైర్మన్ పోల్నేని సత్యనారాయణరావు

జమ్మికుంట, నవంబర్14: పాడి కౌశిక్‌రెడ్డి కూతురు తన తండ్రి కోసం ఓటు అడగడం నేరమైనట్లు తుమ్మేటి సమ్మిరెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు సరైనవి కాదని, ఆయన తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పోల్నేని సత్యనారాయణరావు డిమాండ్ చేశారు. చట్టాల మీద అవగాహన లేని తుమ్మేటికి మహిళలు తగిన బుద్ధి చెబుతారని, సమ్మిరెడ్డి అనే వ్యక్తి కనీస పరిజ్ఞానం లేని అజ్ఞానని దుయ్యబట్టారు. మంగళవారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో అన్ని పార్టీల ప్రచార సరళిని ప్రజలు గమనించాలని, ప్రతి అభ్యర్థి తమ బంధువులు ప్రచారం చేస్తున్న విషయాలను గుర్తు చేశారు. ఇటీవల బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కూడా కౌశిక్‌రెడ్డి భార్యనుద్దేశించి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. చదువు, సంస్కారం లేకుండా మాట్లాడడాన్ని తప్పుబట్టారు. ఇక తుమ్మేటి సమ్మిరెడ్డి ఇక్కడి వ్యక్తి కాదని, వలసవాద రాజకీయాలకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో రాకేశ్, సదానందం, శశి, వంశీ, సన్నీ, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిక

హుజూరాబాద్‌టౌన్, నవంబర్14: హుజూరాబాద్, ఇప్పలనర్సింగాపూర్, కాట్రపల్లి, తుమ్మనపల్లి గ్రామాలకు చెందిన సుమారు 50 మంది బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద వారికి బండ శ్రీనివాస్ గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సంగెం ఐలయ్య, రాష్ట్ర నాయకుడు వర్ధినేని రవీందర్ రావు, హుజూరాబాద్ సింగిల్ విండో అధ్యక్షుడు ఎడవెల్లి కొండల్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కొలిపాక సమ్మయ్య, కాసగోని కిరణ్‌గౌడ్, ఎం రాజుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా డయాబెటీస్ డే

జమ్మికుంట, నవంబర్ 14: పట్టణంలోని సంజీవని మల్టీ సూపర్ స్పెషాలిటీ దవాఖానలో ప్రపంచ డయాబెటీస్ డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దవాఖాన ప్రముఖ వైద్యుడు ఊడుగుల సురేశ్ ఆధ్వర్యంలో రోగులకు ఉచితంగా డయాబెటీస్ పరీక్షలు చేశారు. మందులు అందజేశారు. అనంతరం 'డయాబెటీస్ స్వీయ నిర్వాహణ' అనే పుస్తకాన్ని ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ సుధాకర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. సదరు పుస్తకాలను రోగులకు అందించారు. ఈ కార్యక్రమంలో దవాఖాన వైద్యులు సురేశ్, కిశోర్, అనిత, ప్రణీత, సిబ్బంది కిరణ్ తదితరులు పాల్గొన్నారు.